# తండ్రీ - కొడుకూ

(ఒక అనుభూతి)

తొలకరి తుంపర్లు పడుతాయని ఎండి పగిలిన భూమీ, ఎర్రని లేత మామిడి చిగుళ్లకోసం వసంతకోకిలా ఎదురుచూస్తూ వుంటాయి. నేనూ ఎదురుచూస్తూవుంటాను తిరిగిరాని మా నాయన కోసం. అందుకోసమే అనుకుంటాను నా బాధ యోజనాలు దాటి పరుగెత్తుతోంది. నీలి నీలి మేఘాల అంచుల్లో కలిసిపోతోంది. ఆయన తిరిగి రాలేరు. కాని ఆయన నాకోసం విడిచి వెళ్లారు. ఈ గూడులో నిత్యమూ కనిపించే ఈ నల్లకళ్లద్దాల్ని నాకొరకే విడిచి వెళ్లారు. అవును. నాకు బాగా తెలుసు మా నాయన చనిపోయాడని. ఆ రాత్రి నాకు జ్ఞాపకంలో వుంది. కిటికీ సందుల్లోంచి హేమంతం చల్లటి చేతుల్లో హృదయపూర్వకమైన ఆహ్వానం పంపిన రాత్రి, తీతువులు తీగలమీంచి కూస్తూ విజయ గర్వంతో మా నాయన గదికేసి తొంగిచూసిన రాత్రి నాకు గుర్తులో వుంది. ఆనాడు మా నాయన యిహలోకాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆయన ఆఖరు శ్వాస అనంత ప్రాణవాయువుల్లో లీనమై పోవడం నాకు బాగా జ్ఞాపకంలో వుంది. అంతే కాదు. ఈ నా హస్తాలు ఆయన శరీరంలోని వేడి తగ్గిందని తెలుసుకున్నా. యీ నా నేత్రాలు ఆయనలోని ఆగిపోయిన హంసల నడకల్ని యథార్థంగా చూసినా, నే నెంత భయపడిపోయానో నాకు తెలుసు.

కాని యిప్పుడు యీ నా నేత్రాలు విజ్ఞానగోచిస్సుకేసి తమనుకుంటూ పరిగెత్తుతున్నాయి. ఏమిటో అనిర్వచనీయమైన అపూర్వ సందేశాన్ని గ్రహిస్తున్నాయి. మా నాయన చనిపోలేదా? ఏమో! ఎందుచేతనో తెలీదు. ఆయన నాలోనూ, నా చుట్టూ యింకా సజీవంగా పర్యటిస్తున్నట్టే అనుకుంటాను. భౌతికశరీరం కాష్ఠాల మంటల్లో మసిగామారి పవిత్ర గోదావరీ జలంలో కలిసి ప్రవహించినా, ఆయన వున్నారు. తప్పకుండా వున్నారు. ఒంటరిగా లేక నాతో వున్నారు. మామూలుగా కాక స్నేహితునిలా తియ్యగా మాట్లాడుతూ వున్నారు. ఆ చెరువు గట్టుని, కొబ్బరిచెట్ల నీడని, సాయంత్రం, అస్తమిస్తూన్న సూర్య కిరణాల్ని చూస్తూ, ఆయన నీలికళ్లద్దాలలోంచి నాయనా అని మా నాయన పిలుస్తూనే వున్నారు. ముడతలు పడి నలిగిన నా చొక్కా కాలర్ని సర్దుతూ, ప్రపంచానుభవాల్ని వ్యక్తపరుస్తూ మా నాయన, నా కళ్ల ముందు కూర్చునే వున్నారు. నా కళ్లు మూతలు పడవు. కళ్లు మూసుకోవడానికి ఎంతని ప్రయత్నం చెయ్యను?

ఏం ఎందుకిల్లా అనుకుంటాను? నేను పిచ్చివాణ్నా? కాదు. పిచ్చివాణ్ని కాదు. ఆయన చనిపోలేదని భ్రమించడానికి ఆయన వదిలివెళ్లిన వెలుగుబాటలు కారణం. ఎంత ఉజ్వలమైన జీవితం గడిపారు. అందుకనే ఆ వెలుగు యింకా సజీవమై నా కంటికి నిత్యసత్యమైన సత్య స్వరూపంగా కనపడుతుంది. అందుకనే ఆయన జీవించి వున్నారనుకోడం. మానవుణ్ని ఆ తియ్యటి స్వప్నాలే బ్రతికిస్తాయి.

అల్లాంటి మా నాయన్ని గురించిన విషయాలు ఎన్నో నాకు తెలుసు. తండ్రిగా, సోదరునిగా, స్నేహితునిగా, సామాజకునిగా ఆయన్ని సమస్త కోణాలనుంచీ అర్థం చేసుకున్నాను. కనకనే ఆయనంటే నా కంత మమకారం. మహారాజుల్లో సామాన్యుడు కాక పోయినా, సామాన్యుల్లో అసామాన్యుడాయన. అందుకనే ఆయన నా కళ్ళముందు అజంతా శిల్పంలా వెలుగుతూ వుంటారు. జీవితాన్ని సమస్త మార్గాల్లోనూ నడిపించి, కళాపరమైన ఉత్కృష్ట ధర్మాన్ని చవి చూపించారు కనకనే ఆయన చనిపోలేదనుకోవడం. జాతికి ఇలాంటి తండ్రులు కావాలి. జీవితమే ఒకకళగా నిరూపించడం ఎంతటివారికి!

చింతా శ్రీరామచంద్రమూర్తి

ఇలా చెప్పగలగడానికి మా నాయన నీలి కళ్ళద్దాలు కారణం. క్రింద తెలుపూ, పైన నలుపూ కలిగిన ఆ కళ్ళద్దాలలోంచి మా నాయన లోకంవైపు దృష్టిని కేంద్రీకరిస్తుంటే ఏదో దివ్యమైన వెలుగు కనిపించేది నాకు. ఆయన సంపాదించిన యీ యింటికన్నా, యింటిలోని ఏ యితర సామగ్రికన్నా, పక్కని అలమారులో వున్న ఆ కళ్ళద్దాలు. నాకు వాటిని చూస్తుంటే నేటికీ ఆయనలోని ఉత్కృష్టభావాల అపూర్వ సమ్మేళనం కంటికి కట్టినట్టుంది. ఆయన గతించినా ఆ నీలి కళ్ళద్దాల వెనకనించి వచ్చిన ఆ చూపులు, అజ్ఞానతేజస్సు ఆయనను బ్రతికిస్తూనే వున్నాయి.

ఆయ్యనకోసం కడజాతి చర్మం కుట్టేవాడి మొదలు, పన్నులు వసూలుచేసే జమీందారు వరకూ అన్నివర్గాలవారూ వచ్చేవారు. వీధి అరుగుమీద వరసగా వేసిన కుర్చీల వరసలో ఎవరెలా కూర్చున్నా ఇబ్బంది లేదు. తనుమాత్రం క్రిందనే, ఒక్కొ క్రిందనే తాటాకుల చదరవేసుకు కూర్చుని పోతనగారి భాగవతగ్రంథాన్ని ఆంధ్ర జాతికి అవతరించిన మహత్తర కావ్యంగా ఎంచి పుటలు తిరగవేస్తూ వుండేవారు. ఇదిచూసి నేనడిగేవాణ్ణి అజ్ఞానం వుట్టిపడేలాగ.

'నాన్నాయ్. అందర్నీ ఒక్కలాగే చూస్తారేం. పేదవాళ్ళ పక్కని కూచుందికి జమీందార్లు బిడియపడరూ?'

మా నాయన నా ధోరణిచూసి ఒక్క నవ్వు నవ్వేవాడు.

'వెర్రి అబ్బాయ్. నీకు నిరసనభావం తెలియదురా. బీదా గొప్పా సామ్యం స్మశానంలో కనబడుతుందా? పాంచభౌతిక శరీరంలో యిన్నివేల మాంసలూ అందరిలోనూ ఒక్కటే రకంగా కొట్టుకుంటున్నాయి. నీ ఎక్కువేమిటి నా తక్కువేమిటి' అనేవారు ఆయన.

మనమంతా ఒకరి వెనక ఒకరు కాల శకటంలోంచి వేర్వేరు స్టేషనులలో దిగిపోయే ప్రయాణీకులం. మా నాయన యీ బండిలోంచి దిగివెళ్ళిపోయారు. ఎక్కడికో. ఎందుకో. నేనొక్కణ్ణే ఒంటరిగా అయిపోయాను. నా ప్రక్కనే ఆయన నీలి కళ్ళద్దాలు మాత్రం వెలుగుతూ నాకు మార్గాన్ని చూపుతున్నాయి.

ఆ కళ్ళద్దాలు ఒకటేకాదు. ఇంకా ఎన్నో ఆయనజీవితకథకిసంబంధించినవిషయాలు. ఆయన పెంచిన లేగదూడలూ, నాటినతోటలూ, నడిచిన బాటలూ ఎన్నిలేవు! ఆయన గతించిపోయినా ఆయన చర్యలు యావన విలాసంతో నేటికీ ప్రతిభావంతమై శాశ్వత ముద్రల్ని కల్పించుకున్నాయి. అల్లాంటి మానాయన ఏడీ! లేడు. ఎక్కడికో ఎందుకో వెళ్ళిపోయాడు.

అయితేమాత్రం ఆయన నాకేమీ లోటు చెయ్యలేదు. ప్రగతి మానవుని సముజ్వల పరిణామాన్ని అతను చూరగొన్నాడు. అందుకునే మనస్సుకు తెలివినీ, పొట్టకు తిండినీ, శరీరానికి బట్టనీ యిచ్చి, యీ లోకంనుంచి, సెలవు తీసుకువెళ్ళిపోయాడు.

అల్లాంటి మా నాయన నన్నో కోరిక కోరేవాడు.

"నాన్నాయ్! నా ముసలితనంలో నన్ను రక్షించాలిసుమా" అజ్ఞానంలో కొట్టుకొంటున్న నా బుర్రకి అపని ఎంతో సులువుగా కనిపించి అదెంతపని అనుకునేవాణ్ణి. గర్వంతో భుజాలు ఎగరవేసే వాణ్ణి. అదెంత పనా? జరామరణాల కఠినత్వంనించి, కౌగిళ్ళపొత్తునించి మానవుణ్ణి కాపాడే రోజు యింకా రాలేదుకదూ?

అల్లాంటి ప్రేమాస్పదుడైన మా నాయన చివరి కోర్కె నొక్కదాన్నైనా తీర్చలేకపోయాను. మానాయన నేత్రాలు పడిపోయాయి. ఈ లోకానికి ఆయనా, ఆయనకు యీ లోకమూ రెండూ లేవు.

నాకుమాత్రం ఒక్కటే మిగిలివుంది. మా నాయనగారి నల్ల కళ్ళద్దాలు. సుఖ దుఃఖాల సమన్వయానికి ఆ కళ్ళద్దాలు ఎంతగానో పురకరిస్తాయి. కారణం వాటి నిర్మాణంలోనే యీ అనంత ప్రాపంచిక స్వభావం ఆవిర్భవించి వుంది. క్రింద తెలుపూ, పైన నలుపూ కలిగిన ఆ నల్ల కళ్ళద్దాలు న్యాయాన్యాయలకీ, వెలుగు చీకట్లకీ ప్రతిబింబంగా ఎంచుకుంటాను. ఆ నీలి కళ్ళద్దాలే నిర్జీవతని తరిమి యుగాంతాలకీ నిలిచి మా నాయన్ని బ్రతికించుకుంటాయి. మా నాయన చనిపోతే ఏం?

అల్లాంటి మా నాయనకి సత్యమంటే భగవంతుడు. ప్రపంచాన్ని జాగృతివైపు నడిపించే

బాట అది ఒక్కటేనని అతని విశ్వాసం. ఒకసారి నేను ఉమర్ ఖయ్యామ్‌ని చదువుతున్నాను. ఏమి చెప్తాడురా, ఆకవి? అని ప్రశ్నించాడు మా నాయన. నేను నిజం పలికాను. మా నాయన ఉరిమి చూశాడు. మానవకోటికి రేపు అనేది రానేరాదన్న విశ్వాసం ఎంత చెడ్డది? లోకానికి భవిష్యత్తు లేదూ? నాన్సాయ్! నువ్వు అల్లాంటి పుస్తకాలు చదవకు. అన్నాడు.

అందుకనే మా నాయన కవి అనుకుంటాను. విమర్శతో ఆదర్శ జీవిత గ్రంథాన్ని రాసుకున్నాడు ఆయన. భవిష్యత్తుకోసం పాటుపడే ఎర్రచీమలూ, తేనెటీగలూ మనకంటె ఎంతో తార్కిక శక్తి కలిగినవి అని కావ్య ధోరణిలో మాట్లాడేవారు మా నాయన. కొంతమంది కవుల్లో కవితాహృదయం వుండదు. కాని పద్యాలు రాస్తారు. వారు అచ్చుకవులు. కాని మా నాయన పద్యాలు రాయని కవి. అతని హృదయం కవితాహృదయం. లోకం యొక్క సమస్తజీవిత కోణాల్నీ, వైజ్ఞానిక హృదయంతో ఆద్యంతాలు ఆకళించుకుని బ్రతికారు: అందుకనే ఆయన కవి అంటాను నేను. వికసించి రాలిన పువ్వులు చూసినా, వెలిగి ఆరిన జ్యోతిని చూసినా, పాడి ఆగిన కోకిల కనపడినా మా నాయన గుర్తుకొస్తారు. ఆయన గుర్తులోకి రావడానికి ఆయన సిలికళ్లద్దాల వెనకనించి ప్రపంచంమీదికి దూసుకు వచ్చిన ప్రగతిభావాలే కారణం.

ఒక ఘట్టం నాకింకా గుర్తుంది. చిన్నపిల్లలందరూ మా నాయనకి స్నేహితులు. కుల మత విచక్షణ లేకుండా, గ్రీష్మఋతువు సాయం సమయాల్లో పైరుగాలిలో పొలాల్లో ఎగిరే గాలిపడగలన్నీ మా నాయన స్వహస్తాల్తో కట్టినవే. పిల్లలికి గాలిపడగలవల్ల స్వతంత్రాభిప్రాయాలతో పాటు, స్వేచ్ఛగా జీవించడం అన్న అలవాటు కలుగుతుందని, ప్రతి యింటి నించీ పసిపిల్లల్ని పోగుచేసి, అందరినీ ఒక్క తాటిపై నడిపించి, అందరికీ ప్రియబంధువై బ్రతికాడు. మొన్న సాయంత్రం మా పొరుగింటి మల్లయ్యగారి మనవడు అడుగుతున్నాడు నన్ను.

'తాతయ్య గాలిపడగలు కట్టరూ?'

....................

'తాతయ్య ఏవూరు వెళ్లాడు?'

....................

'ఎప్పుడొస్తాడు? నాకేమీ తోచటం లేదు. చెప్పవూ.'

ఆ పసిహృదయానికి ఏమని చెప్పి సంతృప్తిపరచను. తిరిగిరాని మా నాయన మరువలేని ఏ విశ్వాంతర భూముల్లో గాలిపడగలు కడుతున్నారో ఎవరికి తెలుసు!

అల్లాంటి మా నాయన్ను గురించిన విషయాలు చాలా వున్నాయి. జాతి బాగుపడాలంటే భారత స్త్రీలు ఎల్లాంటి విద్యలు అభ్యసించాలి అన్న విషయం మొదలు ప్రపంచశాంతి కావాలంటే ఎల్లాంటి కార్యక్రమాన్ని అనుసరించాలి అనే సమస్యదాకా మా నాయన చర్చించేవాడు. స్వజాతి సంప్రదాయాల్ని నాశనంచేసి పరజాతి సప్తస్వరాల్ని ఆలకించడం ఎంతటి శోచనీయమైన విషయం అనేవారు ఆయన.

అన్నిటికంటె ముఖ్యమైనది ఆయనకు ప్రేమ మీద వున్న అభిప్రాయాలు. అవి చాలా గొప్పవి. ఎవరైనా ఫలానా వ్యక్తులు హృదయపూర్వకంగా ప్రేమించుకున్నారని తెలుస్తే ఆ వివాహం పూర్తి అయ్యేదాకా నిద్రపోయేవారు కారు. ఆయన చివరిరోజుల్లో మరణశయ్యపై వుండగా గోపాలకృష్ణ వచ్చాడు. కృష్ణని గురించి నాయనకు అన్నీ తెలుసు.

'కృష్ణుడా. వచ్చావా నాయనా? ఇంటి దగ్గర అంతా క్షేమమే కదా. కాకినాడలో చదువుకునే రోజుల్లో సంగతి కదూ అది. రుక్మిణిని ఆదరించావా? బాలవితంతువు అనే శంకనించి మనస్సుని తప్పించి వివాహానికి ఒప్పుకున్నావుట కదూ! జాతిని ఉద్ధరించు నాయనా? ఇల్లాంటి విప్లవం వస్తేనే గాని మానవులు దేవతలుగా మారవద్దూ? మీ యిద్దరికీ నా శుభాకాంక్షలు' అన్నాడు. నాయనను కృష్ణుడు నమ్మలేకపోయాడు. ముసలితనంలో యింతటి సాంఘిక పురోగమనం ఎక్కడినించి వచ్చిందీ అని. అందుకనే మా నాయన విశిష్ట ప్రమాణాలు కలిగిన వ్యక్తి అని అనుకోడం.

ఇల్లాంటి ఉత్తమగుణాలే కాకుండా మా నాయన సామాన్య మానవుడు కనక కొన్ని పొరపాట్లూ వున్నాయి. ఇవన్నీ ఆయన బాల్యం

లోనూ, యౌవనంలోనూ జరిగినవి. ఈ అల్లర్లన్నీ ఆయన ముసలిస్నేహితులు నాకు చెప్పినవే.

'ఒరేయి చంటీ! మీ నాయన ఎంత అల్లరి వాడనుకున్నావ్?' చేసెల్లా నమ్మను? ఎంత ప్రశాంతుడుగా కనిపిస్తున్నాడు. ఎప్పుడైనా అల్లరి చేసినవాడని అనుకోగలమా? అందుకనే పెద్దలంటారు. చిన్నతనపు అల్లర్లు పెద్దతనంలో నిర్వికల్ప సమాధుల్ని సృష్టించుకుంటాయి అని.

కాని నాటకాలకోసం మా నాయన ఎంత అల్లరి చేసేవాడో? రాత్రికి రాత్రి నూ పక్లైంచి యిరవై మైళ్లూ నడిచి నడిచి గున్నేశ్వరాష్ట్ర పెంటాలుకు చేరుకోలేదూ? రాత్రికి రాత్రి పెద్ద కాపుగారి దొడ్లో కొబ్బరికాయలు తీసి కోమటి దుకాణంమీద అమ్మి చుట్టలు పిరాయించుకోలేదూ?

అల్లాంటి మా అల్లరి నాయన ఏడీ? లేడు. ఎక్కడికో ఎందుకో వెళ్లిపోయాడు. ఆయన చెప్పిన విషయాలు చాలావరకూ సత్యదూరం కాని విషయాలు. ఈ కాలపు కుర్రాళ్లల్లో చాలామంది తల్లి తండ్రుల మాటల్ని వినడం లేదని తెలుసుకున్నప్పుడు ఆయన ఎంత బాధ పడేవారో? సమాజం బాగుపడాలంటే తరతరాల శక్తుల్ని ఎంత చక్కగా అవగాహన చేసుకోవాలి? అల్లా చేసుకున్నట్టయితే పాత గోడల మీద క్రొత్త పూతలు పూసిన మహదానందం మనం అనుభవిస్తాము. వృద్ధాప్యపు అతీత మేధశ్శక్తిలో యువకుల ఉష్ణ రక్తపు తీవ్రత కలిసి యుగ యుగాల ఆనంద శిఖరాల్ని అంటుతుంది. ఈ సృష్టి రహస్యాన్ని తెలుసుకున్న వారిలో మా నాయన ఒకడు. ఆయన నన్ను విడిచి వెళ్ళిపోయాడు. నాకు మార్గాన్ని చూపేది ఆయన నా కోసం విడిచి వెళ్ళిన ఆ నల్లకళ్ళద్దాలు ఒక్కటే.

స్కెచ్

# పరీక్ష ఫలితం: జీవిత ఫలితం

ఓగేటి శివరామకృష్ణ

రామచంద్రం తన పరీక్ష నెంబరు పత్రికలో ఉండటం చూసి రెండణాలు ఖర్చుపెట్టి హిందూ పత్రిక కొని యింటికి పోవడానికి రోడ్డు పట్టుకొన్నాడు.

'ఏరోయ్ చంద్రం. ఇవాళ రిజల్ట్సు వచ్చాయా ఏమిటి' అని ప్రశ్నించాడు దార్లో చంద్రం వయస్కుడో కాయన.

'ఆ వచ్చాయోయ్. సెకెండు క్లాస్,-' అన్నాడు చంద్రం.

'కన్‌గ్రాట్యులేషన్సు బాగుంది' అన్నాడా వ్యక్తి.

'ఈ యేడు మా రిజల్ట్సు అనుకున్న ప్రకారం లేవు. ఏమిటో' అన్నాడు చంద్రం.

'సరే. మాకు పార్టీ యెప్పుడు! అంటూ వెళ్లిపోయాడు నవ్వుతూ ఆయన.

'నీతో చెప్పకుండా చేస్తానుటోయ్' - అని చంద్రం మరో చిరునవ్వుతో నడక ప్రారంభించాడు.

తమవీధి సందుమలుపు ప్రవేశించాడు చంద్రం.

'ఏమిటోయ్. చంద్రం, విశేషం.' అని వీధి అరుగుమీద కూర్చున్న ముసలాయన ఒకాయన చంద్రాన్ని చూస్తూ ప్రశ్నించాడు.

'పరీక్ష సెకండు క్లాసులో ప్యాసయ్యా తాతగారూ. రంగారావుగారొచ్చిన తర్వాత చెప్పండి' అంటూ వెళ్ళిపోబోయ్యాడు చంద్రం.

'ఆ చాలా సంతోషం. అమ్మాయీ వెంకట్రమణా, మీ కాబోయే అల్లుడు పరీక్ష ప్యాసయ్యేడేవ్ ర్రా నాయనా. అమ్మాయీ రేఖా! మీ బావగారికి ఓ చెంబుతో నీళ్ళుతెచ్చి యివ్వవే,- అంటూ ఆనందంతో బాటు ఆదుర్దా చూపించాడు

'ఆ పనుంది తాతగారూ. ఇంటి దగ్గర యీ సంగతి యింకా తెల్సి ఉండదు. వెళ్ళిచెప్పి రావాలి. ఈ శుభవార్త మామయ్యగారొచ్చిన తర్వాత చెప్పండి' - అంటూ బయలుదేరాడు చంద్రం.

'ఆ చెప్పడమేమిటి. మా రంగడే మీయింటి కొస్తాడులే' అన్నాడు అరుగుమీద కూర్చున్న తాతగారు.